అందాల పోటీలకు మొత్తం ఖర్చు ఎంత?

వై.సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 18(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం విదేశీ మహిళల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిన ఖర్చు అక్షరాలా రూ.4 కోట్లుగా చూపెట్టారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి తెలిపారు. రామప్ప ఆలయాన్ని సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడం విమర్శలకు దారితీసిందని గుర్తు చేశారు. ఆ ఒక్కరోజు ఈవెంట్ కోసం రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు ప్రభుత్వమే ఒప్పుకుందని తెలిపారు. ఈ పోటీలకు రూ.30కోట్ల ఖర్చు పెట్టామని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లెక్కలు చెబుతున్నారని, కానీ కొన్ని గంటల ఈవెంట్‌కే రూ.4కోట్లు ఖర్చు పెట్టారంటే మొత్తం కార్యక్రమాలకు రూ.200 కోట్లకంటే ఎక్కువే ఖర్చుయినట్టు స్పష్టమవుతున్నదని తెలిపారు.

షాహీన్ ఆస్పత్రిలో తనిఖీలు

చార్మినార్, జూన్ 18: 'నగరంలో నకిలీ వైద్యులు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ప్రత్యేకంగా నాలుగు టీంలను ఏర్పాటు చేసిన జిల్లా వైద్యాధికారులు మంగళ, బుధవారం రెండు రోజుల పాటు షాహీన్ ఆసుపత్రిలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో జరిగిన చికిత్సలు, పేషంట్ల వివరాలను సేకరించారు. ఆసుపత్రి నిర్వహణ, అనుమతులు పొందిన వారి వివరాలు, బీయూఎంఎస్ సర్టిఫికెట్లతో చికిత్సలు కొనసాగించిన వారి వివరాలను సేకరించారు. రిపోర్టును జిల్లా వైద్యాధికారులకు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

సుల్తాన్‌బజార్, జూన్ 18: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ డిపో -1 గానుగపూర్, షిరిడీ టూర్లకు ప్రత్యేక ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. గానుగాపూర్, షిరిడీలకు వెళ్లే భక్తులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని హైదరాబాద్ డిపో-వన్ మేనేజర్ కృష్ణారెడ్డి కోరారు. వారాంతాల్లో పుణ్యక్షేత్ర దర్శనాలకు వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఈనెల 26వ తేదీన హైదరాబాద్-1 డిపో ఆధ్వర్యంలోఎంజీబీఎస్ నుంచి (నాన్ ఏసీ - పుష్ బ్యాక్ సీట్స్) నడుపుతున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 27న సాయంత్రం 5గంటలకు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతాయని, ఈ సర్వీస్‌లో గానుగపూర్‌లోనిదత్తాత్రేయ స్వామి, పండరిపూర్‌లోని విఠలేశ్వర స్వామిదర్శనం, తులజాపూర్‌లో భవాని మాత దర్శనం అనంతరం చేరుకుంటుందన్నారు.

షిరిడీ వెళ్లేవారు..

భక్తుల సౌకర్యార్థం ఈనెల 27న హైదరాబాద్-1 డిపో వారిచే ఎంజీబీఎస్ నుంచి షిరిడీకి సూపర్ లగ్జరీ బస్సు(నాన్ ఏసీ పుష్ బ్యాక్ సీట్స్) నడుపబడుచున్నది. ఈనెల 27న సాయంత్రం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతాయన్నారు. సీట్లు బుక్ చేసుకునే వారు www.tgsrtcbus.in, వివరాలకు ఫోన్ నంబర్లు, డిపో మేనేజర్, హైదరాబాద్-1 డిపో: 995 9226248, 998522 3761, 944 05663 79, 7382824794లో సంప్రదించాలని కోరారు.

మాకు గుర్తింపు కార్డులు ఇవ్వండి

సిటీబ్యూరో:ఆషాఢమాసంలో బోనాల సమయంలో తమకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చాలాకాలం నుంచి అమ్మవారితో అనుబంధంగా ఉంటున్న తమకు ప్రత్యేక గుర్తింపు కార్డులివ్వాలంటూ దేవాదాయశాఖ అధికారులను జోగినీలు కోరారు. బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యాలయంలో బోనాల సందర్భంగా జోగినీలకు కావాల్సిన ఏర్పాట్లపై దేవాదాయశాఖ, పోలీసు అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జోగినీలు అధికారులకు సమస్యలను వివరించారు. దేవాదాయ అధికారులు జోగినీలు చెప్పిన సమస్యలపై త్వరలోనే ఇతర శాఖలతో కూడా సమావేశమై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, డైరెక్టర్ వెంకట్రావు, ధార్మిక సలహాదారు గోవిందహరి, హైదరాబాద్ అడిషనల్ సీపీ విక్రమ్‌మాన్‌సింగ్, దేవాదాయశాఖ అధికారులు కృష్ణవేణి, రామకృష్ణారావు, జోగినిలు శ్యామల, నిషాక్రాంతి, స్వర్ణలత పాల్గొన్నారు.

మాగంటికి ఘన నివాళి

సంస్మరణ కార్యక్రమంలో నివాళులర్పించిన మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు

భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

బంజారాహిల్స్, జూన్ 18: జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమం బుధవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, కేపీ.వివేకానంద్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, పువ్వాడ అజయ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, శంకర్ నాయక్, దయాకర్‌రావు, తాతా మధు, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎంఎన్.శ్రీనివాస్, రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, వెల్దండ వెంకటేశ్, సంగీతాయాదవ్ తదితరులు మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించి మాగంటి కుటుంబసభ్యులను పరామర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో పాటు పలు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ అభిమాన నేత చిత్రపటానికి నివాళులర్పించారు. 'జై గోపన్న' నినాదాలతో జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ మార్మోగింది.

మాగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు తలసాని, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు

మాగంటి కుటుంబసభ్యులతో కేటీఆర్ కుమారుడు హిమాన్షు

జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు

ఫార్మా గ్రామాల్లో స్థానికంపై నీలినీడలు

ప్రత్యేక కార్పొరేషన్‌గా ఫార్మా గ్రామాలు

అథారిటీ కమిషనర్‌గా ఒక ఐఏఎస్ అధికారి

ఎన్నికల ఊహాగానాలపై ఆయా పల్లెల్లో సందడి

7 మండలాలు, 56 గ్రామాలపై అయోమయం

రంగారెడ్డి, జూన్ 18 (నమస్తేతెలంగాణ): ఫార్మాసిటీ పరిధిలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా? అన్ని గ్రామాల మాదిరిగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను సర్కారు నిర్వహిస్తుందా? లేదా? అన్న సంశయం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఫార్మా సిటీ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో నెలకొన్నది. ఇప్పటికే త్వరలో సర్కారు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెలకొన్నది. ఫార్మాసిటీ పరిధిలోని గ్రామాల్లో మాత్రం ఇంకా స్పష్టత రావడంలేదు. దీంతో ఆయా గ్రామాల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం ఫార్మా సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ప్రకటించింది. అథారిటీకి ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా కూడా నియమించింది. ఫార్మాసిటీని ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ గ్రామాల పరిధిలో ఎన్నికలపై సందిగ్ధత నెలకొన్నది. ఫార్మాసిటీ అథారిటీలో ఉన్న గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై సాధ్యాసాధ్యాలపై అధికారులు యోచిస్తున్నారు.

ఫార్మాసిటీ పరిధిలోని గ్రామాలు ఇవే..

రంగారెడ్డి జిల్లాలో 7 మండలాలు, 56 గ్రామాలు ఫార్మాసిటీ పరిధిలోకి వస్తాయి. ఆమనగల్లు మండలంలోని కోనాపూర్, రానుంతల, ఇబ్రహీంపట్నం మండలం కప్పాడు, పోచారం, తులేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు, కడ్తాల్ మండలం చరికొండ, కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్విన్, కందుకూరు మండలంలోని దాసర్లపల్లి, అన్నోజిగూడ, గూడూరు, దెబ్బడగూడ, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, లేమూర్, మాదాపూర్, మీరఖాన్‌పేట్, ముచ్చర్ల, రాచులూరు, తిమ్మాయిపల్లి, తిమ్మాపూర్, మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, మహబత్‌నగర్, మంచాల మండలంలోని ఆగాపల్లి, నోముల, యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, గున్‌గల్, కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, తాటిపర్తి, తులేఖుర్దు, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి ఈ గ్రామపంచాయతీలన్ని ఫ్యూచర్‌సిటీ అథారిటీలోకి వెల్లాయి.

నాయకుల ఎదురుచూపులు

ఫార్మాసిటీ పరిధిలోని 7 మండలాల్లోని వివిధ గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆయా గ్రామాల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న అనుమానంలో ఉన్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని వారంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో గెలుపొందాలన్న పట్టుదలతో వారంతా ఉన్నారు. ఈ పరిస్థితిలో ఎన్నికల నిర్వహణపై నీలినీడలు కమ్ముకోవడంతో ఆశావహులు అయోమయంలో పడ్డారు. ఫార్మాసిటీ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్‌పడితే జిల్లాలో మరో రెండు జడ్పీటీసీ స్థానాలు తగ్గనున్నాయి.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

కవాడిగూడ, జూన్ 18: స్థానిక సంస్థల సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని పలు పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద మహాదీక్షను చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, కాంగ్రెస్ సంవిదాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనాభాకు అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లకు అనుగుణంగా ప్రత్యేక జీవోను జారీ చేసి 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్లను చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త గుజ్జకృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, నందగోపాల్, డి.నరహరి, శ్రీనివాస్, రజని, విమల, పద్మావతి, సుధాకర్, జగదీశ్, సతీశ్ తదితరులతో పాటు పలు పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఓబీసీఎస్ఏ నాయకులు

బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలి

21న ఓయూలో సత్యాగ్రహ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈనెల 21వ తేదీన సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్, మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పందించని పక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ నాయకులు లక్కీ, రామ్ గౌడ్, ప్రశాంత్, కళ్యాణ్ యాదవ్, శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి తెలంగాణ షూటింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు 11వ రాష్ట్రస్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్ జరుగనున్నది. ఈ విషయాన్ని తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టీఆర్ఏ) బుధవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. షూటింగ్‌ను అందరికీ దగ్గర చేయాలనే ఉద్దేశంతో ఈసారి ఔత్సాహిక షూటర్లకు టీఆర్ఏ అవకాశం కల్పిస్తున్నదని అధ్యక్షుడు అమిత్ సంఘీ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,250 మంది షూటర్లు టోర్నీలో పోటీపడే అవకాశముందన్నారు. టోర్నీలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్-పిస్టల్, 25 మీటర్ల రైఫిల్-పిస్టల్, 50 మీటర్ల రైఫిల్-పిస్టల్, షాట్‌గన్, స్కీట్‌షూటింగ్, డబుల్ ట్రాప్ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి.

ఘనంగా శ్రీశాంతి కృష్ణ సేవా సమితి వార్షికోత్సవం

తెలుగు సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాలని రాష్ట్ర పర్యటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలుగు తేజంతో విశ్వశాంతిని కాంక్షిస్తూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తూ..శ్రీశాంతి కృష్ణ సేవా సమితి 40వ వార్షిక వసంతోత్సవాలను పురస్కరించుకొని 1111వ అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవాలు రెండురోజులపాటు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విశ్వ కళావిరాట్ డా. శాంతి కృష్ణఆచార్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి సభ్యుడు దాసోజు శ్రవణ్, జాతీయ బీసీ కమిషన్ పూర్వ సభ్యులు తల్లోజు ఆచారి, వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు శాంతి కృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

– రవీంద్రభారతి, జూన్ 18

అయినోళ్లకే అందలం!

(మొదటిపేజీ తరువాయి)

అవుట్ డోర్ ప్రకటనలను క్రమబద్ధీకరించాలనే లక్ష్యంతో అమలులో ఉన్న జీవో నం. 68ను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే మార్పులు చేసింది. వాణిజ్య ప్రకటనల కోసం ఏర్పాటు చేసే బోర్డులు 15 ఫీట్లకు తగ్గకుండా ఉండాలి. కానీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ కొందరికి మాత్రమే ఆ జీవో నుంచి మినహాయింపునిచ్చింది. నిజానికి ప్రభుత్వాలు చేసే చట్టాలు, నిబంధనలు అందరికీ వర్తించేలా ఉంటాయి. కానీ కాంగ్రెస్ పాలనలో అప్పుల కోసం మినహాయింపులతో పాటు, సవరణలు కూడా జరుగుతాయని చెప్పడానికి తాజా ఘటననే నిదర్శనంగా నిలుస్తోంది. వాస్తవంగా ప్రకటన విధానంపై సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చేయాలి. కానీ ఒకరిద్దరి చేతుల్లోనే ఈ వ్యవహారం పెట్టడంతో అటు జీహెచ్ఎంసీ ఆదాయానికి, ఇటు ఈ రంగంపై ఆధారపడి ఉన్న దాదాపు 209 మంది ఏజెన్సీలకు నష్టం జరుగుతున్నది. గతంలో ఏటా జీహెచ్ఎంసీ ప్రకటన రూపంలో రూ. 80 కోట్ల మేర ఆదాయం వస్తే గడిచిన ఏడాదిన్నర కాలంగా రూ.30 కోట్లు కూడా రాకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

కండ్ల ముందే అక్రమం..

కేబీఆర్ పార్కు ప్రధాన గేటు సమీపంలో 484 గజాల స్థలంలో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ ప్రాజెక్టును నవ నిర్మాణ్ అసోసియేట్‌కు ప్రభుత్వం అప్పగించింది. వాస్తవంగా ఈ సంస్థ టెండర్ దక్కించుకున్న తీరు నుంచి ప్రాజెక్టు పనులు చేపడుతున్న ప్రస్తుతం వరకు వివాదాస్పదంగానే ఉంది. వాస్తవంగా టెండర్ ప్రక్రియ మొదలు పెట్టకుండానే ప్రభుత్వం నుంచి కేబీఆర్ పార్కు వద్ద జీవో నం. 68 నుంచి మినహాయింపులు ఇస్తూ జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే సదరు పనులు దక్కించుకున్న నవ నిర్మాణ్ అసోసియేట్ టెండర్ నిబంధనలను అడుగడుగునా ఉల్లంఘనలు జరుపుతున్నది. కేటాయించిన స్థలం కంటే అనధికారికంగా మరో వెయ్యి గజాల స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చాకనే నిబంధనల ప్రకారం ప్రకటనలు, గ్రౌండ్ లెవల్‌లో క్యాఫిటేరియా, కాంప్లెక్స్ అనుకుని ఎల్ఈడీ సైన్‌బోర్డులు ఏర్పాటు చేసుకుని ఆదాయం వైపు అడుగులు వేయాలి. కానీ నిబంధనలకు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎల్ఈడీ భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి గడిచిన 20 రోజులుగా అక్రమ దందాకు తెరలేపారు. కండ్ల ముందు అక్రమ సంపాదనకు తెరలేపిన నవ నిర్మాణ్ అసోసియేట్ జోలికి సంబంధిత విభాగం అధికారులు వెళ్లడం లేదు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సందర్భంగా సభ్యులు ఈ సంస్థకు ఈ ప్రాజెక్టు ఎలా అప్పగిస్తారని, నిబంధనలు ఉల్లంఘించిన చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయి. అధికారులు మాత్రం ఎల్ఈడీ స్క్రీన్ ప్రచారంపై నోటీసులు ఇచ్చామని చెబుతున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని అడ్డుకట్టలేకపోతున్నారు.

సదరు సంస్థపై ఈగ వాలకుండా చేస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. కాగా, ప్రకటనలో విభాగంలో ఉండి..జీహెచ్ఎంసీకి రూ.110కోట్లకు పైగా టోకరా వేసిన వ్యక్తులు అడ్డదారిలో వస్తే పనులెట్ల అప్పగిస్తారని కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, ఆవుల రవీందర్ రెడ్డిలు ప్రశ్నించారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు విషయంలో సదరు నవ నిర్మాణ్ అసోసియేట్‌పై ఎందుకు అంత ప్రేమ అని మండిపడ్డారు. ప్రాజెక్టు పూర్తి కాకముందే ప్రకటనలు మొదలు పెట్టిన సదరు ఏజెన్సీపై కఠినంగా వ్యవహరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కవర్ కట్టుకొని.. హీలియం పీల్చి..

(మొదటిపేజీ తరువాయి)

బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి వెళ్లిన సురేశ్ రెడ్డి కొండాపూర్ రాజరాజేశ్వరి కాలనీలో ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గదిని శుభ్రం చేసేందుకు వాచ్‌మెన్ ఎంత తలుపు తట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా, సురేశ్‌రెడ్డి తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని హీలియం గ్యాస్ పీల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. సురేశ్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్న గదిలో హీలియం గ్యాస్ సిలిండర్‌తో పాటు సుసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పని ఒత్తిడి తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

.. అడ్డుగోడలా మిస్టర్ 10%

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్తు శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇప్పటివరకు ఏదో ఒకరకంగా దాటవేత ధోరణే ప్రదర్శించినా దుండిగల్ వ్యవహారంలో కూడా టెండర్లు క్యాన్సిల్ చేసి మళ్లీ కేబుల్‌తో సహా పిలుస్తారా.. లేక తామే కేబుల్ సప్లై చేసేందుకు మిస్టర్ టెన్‌పర్సెంట్‌ను ఒప్పిస్తారా.. ఈ విషయంలో పై స్థాయి అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.సమ్మర్‌యాక్షన్ ప్లాన్లకు సంబంధించిన పనుల కోసం 33 కేవీ కేబుల్‌కు కిలోమీటర్‌కు రూ.30,19,133.84 చొప్పున చెల్లిస్తామని డిస్కం కాంట్రాక్టర్లకు లేఖ పంపింది. ఇందుకు తమ అనుమతి తెలియచేయాలని కోరింది. ఒక్కో మీటర్‌కు డిస్కం రూ. 3019 చెల్లిస్తే తమకు గిట్టుబాటు కాదని వారు కాంట్రాక్టర్లు అంటున్నట్టు తెలిసింది. హెచ్‌టీ కనెక్షన్లకు వినియోగదారుల వద్ద డిస్కం రూ.3800 వసూలు చేస్తూ.. తమకు అంతకంటే తక్కువ చెల్లించడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెండుమూడురోజుల్లో ఒక నిర్ణయం తీసుకుని సామూహికంగా తాము పనులు చేయలేమని చెప్పి, ఈఎండీలు వెనక్కు తీసుకోవాలని కొందరు కాంట్రాక్టర్లు నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఒక సీనియర్ అధికారి కూడా కాంట్రాక్టర్లతో మీ పనులు ఇప్పట్లో అయ్యేవి కావు.. కేబుల్ కొనేది లేదు.. మీరు కొన్నా వర్కవుట్ కాదు.. ఈ పనులు వదిలేసి వేరే పనులు చూసుకోమని సలహా ఇచ్చినట్టు తెలిసింది.

హిసాబ్ సెటిల్ చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తుందని గొంతుచించుకుంటున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో రేవంత్ రెడ్డి చేస్తున్న అరాచకాలు కనిపించడం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ మొహబ్బత్ కా దుకాణ్ అంటుంటే, తెలంగాణను రేవంత్‌రెడ్డి నఫ్రత్ కా మకాన్ లాగా మార్చేశాడని కేటీఆర్ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోయాక కూడా కేసీఆర్ సైనికుడిగా బీఆర్ఎస్‌లోనే ఉన్న సర్దార్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని స్థానిక కార్పొరేటర్ అధికార మత్తులో వేధించాడని కేటీఆర్ విమర్శించారు. పార్టీ మారడానికి ఒప్పుకోకపోవడంతో కక్ష కట్టి సర్దార్ ఇంటిని, షాప్‌ను కూల్చివేయించాడని ఆరోపించారు. తాము తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, బీఆర్ఎస్ నేతలు, పేదలను వేధిస్తున్న కాంగ్రెస్ నేతల, అధికారుల హిసాబ్ కితాబ్ సెటిల్ చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆడిచ్చినట్టు ఆడుతున్న అధికారులు ఇప్పటికైనా తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. పదేళ్ల పాటు పేదల బతుకుల్ని మార్చడానికి పనిచేసిన తాము రేపు అధికారంలోకి వచ్చాక ఇలానే వ్యవహరిస్తే ఒక్క కాంగ్రెస్, బీజేపీ నేత కూడా రోడ్డు మీద తిరగలేడని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఉన్న మురికివాడల్లో ఏది రైటో ఏది రాంగ్ అనేది ఆ దేవుడు కూడా చెప్పలేడని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో కూడా రాలేని గల్లీల్లో ఉంటున్న గరిబోళ్ల మీద హైడ్రా, జీహెచ్ఎంసీని అడ్డంపెట్టుకుని రేవంత్ ప్రభుత్వం విచ్చలవిడిగా అరాచకం సృష్టిస్తుందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని మురికివాడల్లో ఉంటున్న పేదల దుస్థితి చూసి చలించిన కేసీఆర్, భవిష్యత్ తరాలైనా బాగుండాలన్న సదుద్దేశ్యంతో జీవో నంబర్. 58 కింద లక్ష మందికి ఉచితంగా పట్టాలు ఇచ్చారన్నారు. పాతబస్తీతో పాటు హైదరాబాద్‌లోని మురికివాడల్లోని నోటరీ ప్రాపర్టీస్‌ని రెగ్యులరైజ్ చేసేందుకు తమ ప్రభుత్వ హయాంలోనే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. రేవంత్ రెడ్డికి ఏమన్నా బుద్ధి, పేదల పట్ల ప్రేమ ఉంటే ఈ నోటరీ ప్రాపర్టీస్‌ని కూడా రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనుల కంటే రెండు పనులు ఎక్కువ చేయాలే కాని గరిబోళ్ల కడుపు మీద కొట్టి వారి నోటికాడ బువ్వ గుంజుకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులను అడ్డం పెట్టుకుని వేధించినందుకే తమ నేత మహ్మద్ సర్దార్ ఆత్మహత్య చేసుకున్నాడని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా, మూసీ, లగచర్ల బాధితులకు గతంలో అండగా ఉన్నది కేసీఆర్ సైనికులే అని, రెండు రోజులుగా గద్వాల్ జిల్లా ధన్వాడలో రైతుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఏమైనా కక్షలు ఉంటే తమపై కేసులు పెట్టి జైలుకు పంపాలే కాని.. పేదల జోలికి రావద్దన్నారు. పేదలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ కచ్చితంగా అడ్డుకుంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

క్యాడర్‌కు ఏ కష్టం వచ్చినా..

సర్దార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, అవసరమైతే సుప్రీం కోర్టు వరకు వెళ్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్దార్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన పిల్లల చదువు, భవిష్యత్‌కు భరోసాగా ఉంటామన్నారు. స్థానిక కార్పొరేటర్ కూల్చివేయించిన సర్దార్ దుకాణం, ఇంటిని పార్టీనే బాగు చేయిస్తుందని చెప్పారు. సర్దార్ ఫ్యామిలీ తమ బీఆర్ఎస్ ఫ్యామిలీనే అని, చివరి క్షణం వరకు వాళ్లకు అండగా ఉంటామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత నేత మాగంటి గోపీనాథ్ లేని లోటును రానివ్వమన్నారు. బీఆర్ఎస్ క్యాడర్‌కు ఏ కష్టం వచ్చినా.. ఒక్క ఫోన్ కాల్ చేస్తే మొత్తం పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, వెల్దండ వెంకటేశ్, దేదీప్య తదితరులు పాల్గొన్నారు.